

# మేధావి

అనువాదం: రాచపూటి రమేష్
మూలం : ఆంగ్ల కథ 'ACME'
రచయిత: గాల్స్‌వర్త్

ఈరోజుల్లో తెలివైన వాడెవ్వరూ ఆకలితో మాడనక్కర్లేదు. దానికి ఉదాహరణగా నా మిత్రుడైన 'బ్రూస్' కథ మీకు చెప్తాను. నేనతణ్ని మొదటిసారిగా కలుసుకున్నప్పుడే బ్రూస్ వయస్సు దాదాపు అరవై ఏళ్లు వుంటాయేమో! ఆ సరికే దాదాపు పదిహేను పుస్తకాలను రచించిన అతను 'మేధావి'గా కొందరికి సుపరిచితుడు.



'ఎప్పుడూ తెరిచి వుండే తలుపు, ఎక్కుతుంటే ఊగే చెక్క మెట్లు' గల అతని ఇల్లు అడెల్ఫీలోని యార్క్ వీధిలో వుండేది. ప్రజలు తన గురించి ఏమనుకుంటారో ఏమాత్రం పట్టించుకోని రచయిత అతడు. ఇక పత్రికల వారి గురించి బ్రూస్ ఏమాత్రం పట్టించుకొనేవాడు కాదు. వారి రివ్యూలను అతడు ఏనాడు చదివిన పాపాన పోలేదు. సంవత్సరంలో కొన్ని నెలల పాటు దేశాలు తిరిగి, ఇంటికి చేరి తీరికగా పుస్తకం రాయడం మొదలు పెట్టేవాడు బ్రూస్. 'తేనె రంగు జుట్టు, చురకత్తి మీసాలు, పైకి చూసే దట్టమైన కనుబొమ్మలతో, తన సన్నని పొడవాటి రూపంతో ఆడవాళ్లను ఇట్టే ఆకర్షించగల బ్రూస్ అవివాహితుడు. బహుశా వాళ్ల గాలాలకు ఇతడు ఎప్పుడూ అందలేదేమో!

నేను ఈ కథ చెప్పే సంవత్సరంలో బ్రూస్‌కు గడ్డురోజులు దాపురించాయనవచ్చు. అతని చివరి పుస్తకం అమ్మకాల్లో పూర్తిగా విఫలమయింది. పైపెచ్చు చాలా మొత్తం ఖర్చయ్యే ఆపరేషన్ ఒకటి బ్రూస్ చేయించుకోవలసి వచ్చింది. నేనతణ్ణి చూడబోయే సరికి, రెండు కుర్చీలలో వాలి తాపీగా తనకిష్టమైన బ్రెజిల్ చుట్టను తాగుతున్నాడు. వాటి ఘాటైన పొగ నన్నెప్పుడూ ఉక్కిరిబిక్కిరి చేస్తూంటుంది. తన చుట్టూ తెల్ల కాగితాలు పరుచుకొని వున్న అతని ఒళ్లో ఒక రైటింగ్ పాడ్ వుంది. ఆ గదిలో దారిద్ర్యం తాలూకు చిహ్నాలు తాండవిస్తున్నాయి. నేనతణ్ణి దాదాపు ఏడాదిపాటు చూడకపోయినా, నన్ను నిన్ననే చూసినంత ఆప్యాయంగా పలకరించాడు బ్రూస్.

''హలో, నిన్న రాత్రి నేను 'సినిమా' అనే దానికి వెళ్లాను. నువ్వెప్పుడైనా సినిమా హాలుకు వెళ్లావా?''

''ఎప్పుడైనానా? ఎంతకాలం నుంచి సినిమాలు దేశంలో ఆడుతున్నాయో నీకు తెలుసో, దాదాపు 1900 నాటి నుండి!'' అన్నాను నేను.

''అలాగా, నేనిప్పుడొక సినిమా కథను రాస్తున్నాను.'' అన్నాడు బ్రూస్.

''నువ్వు, సినిమా కథనా?'' ఆశ్చర్యపోయాను నేను.

''హెండిలే, నువ్వేనాడు ఊహించని కట్టు కథ'' అంటూ బ్రూస్ పకపకా నవ్వుతూ ఒక పేపర్ల బొత్తిని తీశాడు.

''నా హీరోయిన్...'' గేప్ ఇచ్చి కొనసాగించాడు బ్రూస్. ''ఒక రాజవంశానికి చెందిన స్త్రీ. ఆమె కళ్లు, ఒళ్లు, మనోహరమైనవి. ప్రతి ఒక్కరూ ఆమెను వాంఛిస్తారు. కానీ ఆమె మాటలకందని ఉత్తమురాలు. ఆమె ఎవరి ఒత్తిళ్లకూ లొంగని సందర్భాలు నీకు గగుర్పాటు కలిగిస్తాయి. ఆమెకు పరమ కర్కోటకుడైన అన్న ఒకడున్నాడు. వాడికి ఆమె గురించిన 'దేవరహస్యం' ఒకటి తెలుసు. వాడామెను ఒక కోటీశ్వరుడికి పెద్ద మొత్తంలో డబ్బు పుచ్చుకొని అమ్మేయాలనుకుంటాడు. తస్సాదియ్యా, ఆ కోటీశ్వరుడికి కూడా ఒక దేవరహస్యం వుంది. మొత్తానికి నా కథలో నాలుగు దేవరహస్యాలున్నాయి. పట్టుకుంటే వదలవులే నా కథను'' ఎంగ్సయిటింగ్‌గా అన్నాడు బ్రూస్.

''నీ సమయాన్నిలా వృధా చేసుకుంటున్నావన్నమాట!'' అన్నాను నేను.

''నా సమయమా?'' కోపంగా చెప్పాడు బ్రూస్. ''నా సమయమెవ్వడిక్కావాలి? నా పుస్తకాలెవ్వరూ కొనడం లేదు''

''సరే, నిన్నెవరు చూసుకుంటున్నారు?''

''డాక్టర్లు. వాళ్లకు మన డబ్బు కావాలి. అంతే, నా దగ్గర ఇప్పుడు డబ్బూ, దస్కం మేమీ లేదు. నా గురించి మాట్లాడకు'' అంటూ మళ్లీ తన సినిమా స్క్రిప్టును తీశాడు బ్రూస్ నవ్వుతూనే.

''నిన్న రాత్రి నేను చూసిన ఆ సినిమాలో... ఒక రైలుకూ, కారుకూ మధ్య స్పీడ్ రేసుంది. అదేముంది? నా కథలో, ఒక ట్రైను కూ, కారుకు, గాల్లో ఎగిరే ఒక మెషినుకు, మరో గుర్రానికి నడుమ రేసు పెట్టాను'' అన్నాడు.

నేను నిటారుగా కూర్చున్నాను. ''సరే నీ కథ పూర్తయ్యాక నాకొకసారి ఇవ్వు, నేను చూస్తాను'' అన్నాను.

''అది పూర్తయింది. ఒకే దమ్మున రాసేశానది. ఆగి ఆగి రాస్తాననుకున్నావా? అటువంటి కథను'' అంటూ కాగితాలను పేర్చి నాకు చూపించాడు.

''దీన్ని తీసుకో, సరదా కథ ఇది. రాస్తుం టేనే నాకు బావుంది. హీరోయిన్ రహస్యమేమిటంటే అసలావిడ రాచకన్య కానే కాదు. ఆమెలో దక్షిణాదికి చెందిన క్రియోల్ వంశస్థుల రక్తం ప్రవహిస్తోంది. ఆమె అన్న అసలామెకు సోదరుడే కాదు. దుర్మార్గుడైన కోటీశ్వరుడు. కోటీశ్వరుడే కాదు. ఈ కథలో ఇలాంటి మలుపులు చాలా వున్నాయిలే'' అన్నాడు బ్రూస్.

''థ్యాంక్స్'' అన్నాను నేను నిరాసక్తతో ఆపేపర్లు తీసుకుంటూ...

బ్రూస్ పేదరికాన్ని, అతణ్ని ఆవహించిన అనారోగ్యాన్ని గురించిన ఆలోచనలతో నేను ఇంటిదారి పట్టాను.

రాత్రి భోజనం ముగించి పడుకోబోయే ముందు నేను యధాలాపంగా బ్రూస్ ఇచ్చిన సినిమా తాలుకూ స్క్రిప్ట్ తీసి చదవబోయాను.ముప్పై అయిదు పేజీల ఆ కథలో రెండు పేజీలు చదివానో లేదో, నాలో సంచలనం రేగింది. నేను లేచి కూర్చుని ఏకబిగిన చదివానా కథను. 'ఇది పేరిణీ కథ' సూపర్ హిట్ సినిమాకు కావలసిన మసాలాలన్నీ దట్టించి రాశాడా స్క్రిప్టు బ్రూస్. దానికి ఒక ప్రొఫెషనల్ చిన్న చిన్న మెరుగులు దిద్దాలంతే. నాలో ఎక్సైట్‌మెంట్ ప్రవేశించింది. సరిగ్గా హ్యాండిల్ చేస్తే, ఈ సినిమా స్క్రిప్టుతో బంగారం పండించవచ్చు. ఏ పేరొందిన సినిమా కంపెనీ అయినా దాన్ని లడ్డూలా తన్నుకుపోతాడు. సరే, దాన్ని ఆ కంపెనీల కెలా అందించాలి? బ్రూస్ స్థిరత్వం లేని 'ఒక ముసలి ఏకాకి మానవుడు' అతనికి సినిమా ఒకటుందని మొన్ననే తెలియడంతో అతని మనస్తత్వం ఏమిటో మనకర్థమవుతోంది. ఒక వేళ నేనతనికి 'నీ కథ మంచి సినిమాకు ముడిసరుకు కాగలదు' అంటే ''అలాగా'' అని ఒక వెధవ నవ్వు నవ్వి దాన్ని నిప్పుల్లోకి తోయగలడు. ''కానీ రచయిత పేరు తెలియకుండా ఈ సినిమా కథను మార్కెట్ చేయడం ఎలాగా? నేను మాత్రం బ్రూస్‌కు ఎంతో కొంత సొమ్ము సంపాదించి పెట్టాలనుకుంటున్నాను. ఈ కథను సరిగ్గా వాడుకుంటే బ్రూస్ తన ఆర్థిక సమస్యల నుంచి విముక్తుడు కాగలడన్నది అక్షరాలా నిజం.

''నా చేతుల్లో వున్న అతి విలువైన పురాతన వస్తువు ఏ చిన్న పొరపాటు జరిగినా కిందపడి ముక్కలౌతుందన్న'' భావన నాలో కలిగింది. అతడు సినిమా గురించి మాట్లాడిన మాటలు గుర్తుకు వచ్చాయి నాకు.

''ఆహా, ఎలాంటిదది'' ఈసడింపుగా అన్నాడు బ్రూస్. చాలా పంతం గల ఈ దరిద్రుడితో ఎలా వేగాలో నాకు అర్థం కావడం లేదు.

బ్రూస్ వార్తాపత్రికలస్సలు ముట్టుకోడన్న విషయం గుర్తుకు వచ్చింది నాకు. కానీ వాటిల్లో ఈ స్క్రిప్టు గురించి అతని అనుమతి లేకండా ఈ కథను మార్కెట్ చేయడం సబబుగా వుంటుందా?నేనీ సమస్య గురించి గంటల తరబడి ఆలోచించి, ఏదీ తెగక, మరునాడు బ్రూస్‌ను చూడపోయాను.

ఏదో చదువుకుంటున్న బ్రూస్ నన్ను చూడగానే ''నువ్వేనా? ఈ థియరీ గురించి ఏమంటావు? ఈజిప్టు దేశస్థులు సహారా ఏడారిలోని ఒక ప్రాచీన నాగరికత నుండి ఆవిర్భవించారని ఈ రచయిత వాదన'' అని మొదలుపెట్టబోయాడు.

''నాకు తెలీదు..కానీ'' అన్నాను నేను.

''కానీ లేదు, ఏమీ లేదు. అసలీ రచయిత...'' అనబోయిన బ్రూస్ మాటలకడ్డుపడి నేను ''నీకా కథ మళ్లీ కావాలా, లేక నా దగ్గరే దాన్నుంచుకోనా?'' అన్నాను.

''కథా? ఏం కథ?''అన్నాడు బ్రూస్ యధాలాపంగా.

''నిన్న నాకిచ్చిన కథ. సినిమా స్క్రిప్టు'' అన్నాను నేను.

''మీ ఇంట్లో దాంతో చలి మంట కాచుకో. అసలీ రచయిత''

''ఒక రాజవంశానికి చెందిన స్త్రీ. ఆమె కళ్లు, ఒళ్లు, మనోహరమైనవి. ప్రతి ఒక్కరూ ఆమెను వాంఛిస్తారు. కానీ ఆమె మాటలకందని ఉత్తమురాలు. ఆమె ఎవరి ఒత్తిళ్లకూ లొంగని సందర్భాలు నీకు గగుర్పాటు కలిగిస్తాయి. ఆమెకు పరమ కర్కోటకుడైన అన్న ఒకడున్నాడు. వాడికి ఆమె గురించిన 'దేవరహస్యం' ఒకటి తెలుసు.''

''సరే, నేను అలాగే చేస్తాను. నువ్వు బిజీగా వున్నట్లున్నావు.'' అన్నాను నేను.

''లేదు..లేదు...నాకీ రోజు ఏమీ పనిలేదు. రాయడంలో నాకేం లాభం వుంది? నేను రాసే కొద్దీ రాబడి తగ్గిపోతోంది. పేదరికంలో చస్తున్నాను నేను'' అన్నాడు బ్రూస్ విచారంగా.

''అదెందుకంటే...నువ్వసలు, పాఠకులను, ప్రజలనూ అసలు పట్టించుకోవూ కాబట్టి'' కటువుగా అన్నాను నేను.

''పాఠకులకు ఏం కావాలో నాకు తెలియనప్పుడు నేను వారినెలా పట్టించుకోను?''

''ఎలాగంటే ఏం చెప్పేది? నువ్వసలు శ్రమ తీసుకొని కనుక్కుంటే గదా అది నీకు తెలిసేది. నేను నీకు పాఠకులను రంజింపచేసి డబ్బు సంపాదించే మార్గం చెప్పినా, నన్ను గదిలోంచి బయటకు నెట్టుతావు నువ్వు'' అన్నాను నేను.

''నీ బంగారపు నిధి ఒకటి నా జేబిలోనే వుంది'' అన్న ఆటలు నా నాలిక కొస వరకూ వచ్చి ఆగాయి. నేను బలవంతంగా ఆ మాటలను అణగదొక్కాను. రిస్క్ తీసుకోవడం శ్రేయస్కరం కాదు. బ్రూస్ ఆ స్క్రిప్టును నీకప్పజెప్పాడు. ఇక నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి అని అంతరాత్మ ఘోషిస్తోంది.

నేను బంగారపు నిధి లాంటి ఆ స్క్రిప్టును తీసుకొని వెళ్లి, తుది మెరుగులు దిద్ది మంచి సినిమా కథగా తయారుచేశాను. ఈ విషయం బ్రూస్ మిత్రులతో చర్చించి, రహస్యాన్ని లీక్ చేయడం ప్రమాదకరంగా తోచింది నాకు. కానీ ఇంత పెద్ద చెక్కును క్యాష్ చేసుకోవడంలో ఆలస్యం చేయడం మంచిది కాదు. పైపెచ్చు సినిమా ప్రొడక్షన్ కూడా మొదలయ్యింది. మంచి సినిమాలేవీ రాని గడ్డుకాలం కాబట్టి త్వరగా ఆ సినిమాను షూట్ చేసి వీలైనంత త్వరగా రిలీజ్ చేయాలన్న ఆలోచనలో వున్నారు నిర్మాతలు.

''ఆకలితో, అనారోగ్యంతో మాడుతున్న బ్రూస్ ముఖం నా కళ్ల ముందు మెదిలింది.'' ఎవరినీ పట్టించుకోని ఈ మానవుడు నేను సినిమాకు రాయడమేమిటి? ఏమిటి నీ వుద్దేశం అని నేనిచ్చిన చెక్కును చించి ముక్కలు చేస్తే....

అసలు బ్రూస్‌ను సంప్రదించకుండా ఈ కథను అమ్మడం పెద్ద పొరపాటుగా తోచింది నాకు. నిజం తెలిస్తే కోపగించుకొని నన్ను దూరం చేసుకోవచ్చు బ్రూస్. అతని మీద ఆప్యాయత, గౌరవం వున్న నేను అతనికి దూరం కావడం భరించలేను. చివరకు కథను అమ్మడంలో నా స్వార్థం వుందన్న వాదన బ్రూస్ చెవికెక్కించాలన్న ఆలోచన కలిగింది నాకు. వెంటనే బ్యాంక్‌కి వెళ్లి చెక్కును సొమ్ము చేసుకొని బ్రూస్ పేరుతో మరొక చెక్కు తీసుకొని, కాంట్రాక్టు పేపర్లతో పాటు బ్రూస్ దగ్గరకు వెళ్లాను.

రెండు కుర్చీలపై విలాసంగా కాళ్లు చాపుకొని పడుకొని, బ్రెజిల్ దేశపు ఘాటు చుట్ట తాగుతూ పెంపుడు పిల్లితో ఆడుకుంటున్నాడు బ్రూస్. మామూలు ధోరణికి భిన్నంగా చిరాకుగా కనిపించాడు! అతని ఆరోగ్యం గురించి, మిగిలిన విషయాల గురించి కొంతసేపు మాట్లాడిన తరువాత, ''బ్రూస్ నీకొక నిజం చెప్పాలి'' అన్నాను నేను బెరుగ్గా.

''నిజమా? ఏమిటది?'' అన్నాడు చిరాగ్గా బ్రూస్.

''దాదాపు ఆరు వారాల క్రితం నువ్వు నాకిచ్చిన సినిమా కథ గురించి నీకు గుర్తుందా?''

''లేదు'' పొడిగా అన్నాడు బ్రూస్.

''నీకు గుర్తుండే వుంటుంది...రాచకన్య స్క్రిప్టు'' పకపకా నవ్వాడు బ్రూస్. ఓ అదా! అంటూ నేనొకసారి గట్టిగా ఊపిరి పీల్చుకొని చెప్పాను.

''నేనా కథను అమ్మేశాను. ఆ మూల్యం నీకే చెందుతుంది.''

''ఏమిటీ? అటువంటి కథను ఎవరు ప్రచురిస్తారు?'' ఆశ్చర్యంగా అన్నాడు బ్రూస్.

''అది ప్రచురింపబడలేదు. సినిమాగా తయారవుతోందా కథ. సూపర్ ఫిల్మ్ అని కూడా అంటున్నారు దాన్ని'' చెప్పాను.

బ్రూస్ చెయ్యి పిల్లి ఒంటిపై నిలిచింది. నాకేసి తీక్షణంగా చూశాడు. తడబడుతూ చెప్పాను నేను.

''నేను చేస్తున్నది నీకు చెప్పకపోవడం పొరపాటే కానీ నీవు కోపిష్టివి. విచిత్రమైన మనిషివి. చెప్తే నన్ను అడ్డుకుంటావన్న భయం నాది. వాస్తవమేమిటంటే నీ కథ ఒక గొప్ప చిత్రంగా నిర్మించబడుతోంది. ఇదిగో, ఆ కాంట్రాక్టు, నీ పేరుతో మూడువేల పౌన్లకు చెక్కు ఇది. నువ్వు నన్ను నీ ఏజెంటుగా భావిస్తే, నాకు మూడువందల పౌన్లు ఇవ్వాలి. నేనేమీ నీ నుంచి ఆశించడంలేదు. కానీ నేను నీలా డబ్బు వదులుకునేంత తల పొగరు మనిషిని కాను.''

''గాడ్, ఏమిటిదంతా'' అన్నాడు బ్రూస్ చిరాగ్గా.

''నాకు తెలుసు బ్రూస్, నువ్వు సినిమాలను ఏవగించుకొంటావు. అవి అసహజమైనవని నీ భావన. కానీ ఈ రోజుల్లో ప్రతిదీ అసహజమైనదేగా. సినిమా ఈ రోజుల్లో ఒక గౌరవప్రదమైన మీడియమ్. ప్రజలకు వినోదాన్ని, ఆనందాన్ని ఇస్తుంది సినిమా. ఈ రోజుల్లో ప్రజలకు కావలసిందే సినిమా'' మాటలను కూడదీసుకుంటున్నాను.

బ్రూస్ చూపు నన్ను కట్టిపడేసింది. కానీ ఇంత దాకా వచ్చాక వదలదలచలేదు నేను.

''నువ్వీ కాలానికి చెందిన వాడివి కాదు బ్రూస్. ప్రజలకేం కావాలో నీకు తెలియడం లేదు. జీవితంలోని స్థబ్దతను, నిర్లిప్తతను పోగొట్టి వారిలో ఉత్సాహాన్ని నింపేది కోరుకుంటారు ప్రజలు. సంచలనం, థ్రిల్స్, రక్తపాతం, యుద్ధాలు కోరుకుంటున్నారు వాళ్లు. నువ్వు వాళ్లకు వాటిని ఇవ్వాలని అనుకోలేదు. కానీ అనుకోకుండా నీ కథలో అవన్నీ ఇమిడి వున్నాయి. ఈ డబ్బు నీదే. నువ్వు దాన్ని స్వీకరించక తప్పదు.''

హఠాత్తుగా పిల్లి కిందకు దూకింది. తుఫాను చెలరేగడానికి సమయమాసన్నమైందనుకున్నాను నేను.

''నాకు తెలుసు. నీకు సినిమాలపై ఏహ్య భావముంది....'' కొనసాగించబోయాను కాని...

హఠాత్తుగా అతని గొంతుక బిగ్గరగా వినిపించింది.

''బోష్, నువ్వేం మాట్లాడుతున్నావ్? సినిమాలా? నేను ప్రతి రెండు రోజులకొకసారి చూస్తుంటాను వాటిని తెలుసా?''

''భగవంతుడా'' నివ్వెరపోయి అన్నాను నేను. శక్తి కూడదీసుకుంటూ లేచి, కాంట్రాక్టును, చెక్కును బ్రూస్ చేతిలోకి జొనిపి వేగంగా బయటకు నడిచాను. పిల్లి నన్ను అనుసరిస్తుంటే...

★



## మేమిద్దరం మంచి ఫ్రెండ్స్

''అమృతాకి నాకు మధ్య ఎలాంటి గోడలు లేవు, మామధ్య కోల్డ్‌వార్ నడుస్తోందని వస్తున్న వార్తలన్నీ కేవలం మీడియా సృష్టే''అంటోంది తనుశ్రీదత్తా. అమృతారావ్‌తో తనకు భేదాభిప్రాయాలు కలిగాయని అవాస్తవాలు ప్రచురించారు. ఇండస్ట్రీలో ఎవరి ప్రాధాన్యత వారిదే. నెంబర్ల గురించి పట్టించుకోకూడదంటోంది. ఒకరిని చూసి మరొకరు ఈర్ష్య చెందడం అనేది అర్థం లేనిది అని కొట్టిపారేసింది. మేమిద్దరం మంచి ఫ్రెండ్స్ అంటూ అమృతాకి కితాబులిస్తోంది తనుశ్రీదత్తా.